# తప్పులెన్నువారు

"హల్లో చిన్న పనుంది బాస్ – స్కూటర్ మీద వెళ్ళి వద్దామా ?" అర్థింపుగా కిషోరు .

ఫ్రెండ్స్ బుక్ డిపోలోకి పోబోతున్న అరుణ్ ఆగి వెనక్కి చూసి చిరునవ్వు నవ్వాడు.

"అంతకంటే ఏం కావాలి ? మా స్కూటర్ పావనమవుతుంది – ఎక్కడికి పోవాలి?" ప్రశ్నించాడు.

"బి క్యాంప్ !" చెప్పాడు.

"ఓస్ ఇంతే కదా, ఓ ఆరు కిలో మీటర్లు – నే నింకా విలేజెస్‌కు అనుకున్నా" – విషయం రాబట్టాలని ప్రయత్నిస్తూ అన్నాడు అరుణ్.

" అయితే ముందు నేతాజీ టాకీస్ పైన నా కో చిన్న అర్జెంట్ పని ఉంది. అక్కడికి పోయి బి క్యాంపుకు వెళదాం – మరీ తొందరేం లేదుగా?"

"పర్లేదు అలాగే చేద్దాం జస్ట్ అక్కడ కూడా పెద్ద పనేమి లేదు. చూద్దం రావడం."

"మీ కభ్యంతరం లేకపోతే వివరాలు తెలుసు కోవచ్చా ?"

"అంతకు ముందు చెప్పానుగా – రేపు మా మిసెస్‌కు ఆపరేషన్ ఫిక్స్ చేశారు ఆ సర్జన్ను కలిసి వద్దామని."

"కేవలం కలిపి రావడమేనా?"

"ఐ మీన్ కొంచెం చెయ్యి తడుపు దామని."

"గవర్నమెంట్ హాస్పిటల్లో గదా ఆపరేషన్, ఆయన అడిగాడా?"

"అబ్బే ఆయన అటువంటి వాడు కాదు – ఏదో మన ఆత్రం కొద్దీ"... నసిగాడు కిషోరు .

"రైట్ ఎక్కండి బయలుదేరుదాం."

స్కూటర్ స్టార్ట్ చేసి రోడ్డెక్కించాడు అరుణ్.

దారి పొడుగుతా ఆ సర్జరీ పైన తనెంత ఆశలు పెట్టుకుంది ఏకరువు పెట్టాడు కిషోరు. నేతాజి దగ్గర స్కూటర్ ఆపి లోపలికి వెళ్లాడు.

నేతాజీ లో శ్రీదేవి బొమ్మ ఆడుతున్నది , జనం విరగబడుతున్నారు.

అరుణ్ వచ్చి స్కూటర్ ఎక్కాడు.బయంతాన ఆవాల్ పోస్టరు మించి దృష్టి మళ్ళించి స్కూటర్ మీద కూర్చున్నాడు.స్టార్టయింది రోడ్డు మీదకు వచ్చింది.

స్కూటర్ పాములా మెలికలు తిరిగింది.సడన్ బ్రేక్‌తో ఆపాడు.అరుణ్ దిగి చూశాడు.

"ప్చ్ ! బ్యాక్ టైరు పంక్చర్ అయింది. ఇందాక బావుంది ఇంతలోనే....." అరుణ్

"అంతే బాస్! టైరు మన ప్రాణం లాంటి దెప్పుడు పంక్చరవుతుందో తెలియదు – ఆదిలోనే పాడుచేస్తాడు." కిషోర్ చెప్పాడు అరుణ్ అటు యిటు దిక్కులు చూశాడు దగ్గర్లో పంక్చర షాపు కనిపిస్తుందేమోనని.

"ఇక్కడ దగ్గర్లోనే పంచరేసే వాడు ఉన్నాడు. అతని దగ్గర కెళ్దాం." చెప్పాడు కిషోర్.

బండి తోసుకుంటూ చెమటలు కక్కుకుంటూ ఆ వీథి మొదటి షాపు చేరారు. అది క్రాస్ [illegible] టర్నింగ్ మొదట్లోనే ఉంది – కాబట్టి కనుక్కోవడం కష్టం కాలేదు.

పెద్ద సైజు షాపులో చిన్న సైజ్ మెకానిక్, బుల్లి కుర్రాడు ఉన్నారు.

"పంక్చర్ – అర్జంట్..."

"అచ్ఛా సాబ్! కరేంగే!" బుల్లి మెకానిక్కు చెప్పాడు.

అతడికి ఎనిమిది – తొమ్మిదేళ్ళు ఉంటాయి.

"బాషా, స్పానర్ లావో –" పెద్ద మెకానిక్ స్కూటర్ దగ్గర కూర్చొని ఆర్డర్ జారీ చేశాడు.

"తెస్తున్నా గురూ!" అంటూ వెతికి తెచ్చిచ్చాడు.

అతను శిక్షణ పొందిన సైనికుడిలాగా గబగబా నట్లు ఊడదీసి టైరు తీశాడు. పనిలో మునిగిపోయాడు.

'టింగ్ – టింగ్' సైకిల్ బెల్ మోగింది.

కబుర్లలో పడ్డ మిత్రులు రోడ్డు మీదకి చూశారు. సైకిలు మీద ట్రాఫిక్ కానిస్టేబుల్ ఉన్నాడు...

మెకానిక్ శాల్యూట్ కొట్టాడు.

"ఏం బలరామ్. బాగున్నావా? వ్యాపారం బాగుందా?" కానిస్టేబులు పలకరించాడు.

"థోడా – థోడా – మీదీ దయ –" బాషా చెప్పాడు. బలరామ్ జేబులన్నీ వెతికి డబ్బులు బయటకు తీశాడు. లెక్కేశాడు. ఎనిమిది.

"రెండు రూపాయలు తక్కువున్నాయి. మళ్ళీ రాకూడదా?"

"నా కిదే పని. చూడు ఉంటాయి." కసిరాడు పోలీసు.

"సాబ్ – మీరు సర్దండి." బాషా చెప్పాడు.

కర్తవ్యం గుర్తుకొచ్చిరెండు రూపాయల నోటు తీసి బలరామ్‌కు ఇచ్చాడు అరుణ్.

అతి వినయంగా మొత్తం పది రూపాయలను పోలీసుకు ఇచ్చాడు బలరామ్. సంతోషంగా అతను సైకిల్ తొక్కుకుంటూ వెళ్ళిపోయాడు.

బాషా నాలుక బయటకు పెట్టి అతను వెళ్ళిన వైపు చూసి వెక్కిరించాడు.

"బాకీనా?" కిషోర్ అడిగాడు.

"కాదు సార్ – ప్రతి నెలా ఈ తారీఖున మామూలు ఇవ్వాలి – రాత్రి ఎనిమిదికి రమ్మంటే ముందే వచ్చాడు." మెకానిక్ చెప్పాడు.

"ఇవ్వకపోతే రోడ్డు మీద షా పని కిరికిరి చేస్తాడు."

"ఆఁ! లంచమా? ఇడియట్! ఇందాక చెప్పి ఉంటే బొక్కలోకి తోయించే వాడిని." ఆవేశపడి పోయాడు కిషోర్.

"మరేం పర్లేదు. వచ్చే నెల రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవచ్చు. నేను కావాలంటే కేసు ఫైల్ చేస్తాను." అరుణ్ కోపంగా అన్నాడు.

"నీకేం భయం లేదు. ఈ లంచగొండితనాన్ని నిర్మూలించాలి ఈ దేశం నుంచి. నీ వెనుక మేమున్నాం. కంప్లెయింట్ రాసిస్తావా?" కిషోర్ రెచ్చగొట్టాడు.

"ఏం రాసిమ్మంటారు? ఎవరి కిమ్మంటారు?" నిదానంగా అన్నాడు బలరామ్ వాళ్ళను చూస్తూ.

"ఏ.సి.బి.కి, నాయాల్ని అరెస్టు చేస్తారు. కోర్టుకు ఈడుస్తారు." ఆవేశంగా అన్నాడు.

"ఉపయోగం? ఇతను పోతే ఇంకోతను వస్తాడు. అతని కివ్వాల్సిందేగా? మనం ఇలా చేశామని తెలిస్తే – ఆ వచ్చే అతను ఇంకా పగబడతాడు. వాళ్ళంతా ఒకటేగా?" భయపడుతూ చెప్పాడు బలరామ్.

"అయినా కేసు కొట్టేయించుకుని అతనికి బయట పడడం కష్టం కాదు. ఇతన్నే భయపెట్టి తీసుకున్న అప్పు చెల్ల వేసినట్లు సాక్ష్యం ఇప్పిస్తాడు కోర్టులో. దాంతో కేసు కొట్టి వేస్తారు. తర్వాత ఇతని

షాపు మటుకు గల్లంతు అవుతుంది." సాలోచనగా తన లాయర్ బ్రైన్ ఉపయోగించి చెప్పాడు అరుణ్.

"లేదు బాస్! వీళ్ళను ఇలా వదల కూడదు! మన దేశం ఏమైపోతుంది. కంచే చేను మేస్తే?" కిషోర్ ఆవేశం ఇంకా తగ్గలేదు.

"పంక్చర్ వేసేశావా? గుడ్ – టైరుకు కాబట్టి వేశావు – మన సమాజానికి పడ్డ పంక్చర్లు ఎవరు వేస్తారు?" బాధగా అన్నాడు అరుణ్ డబ్బులిస్తూ.

"ఈ మామూళ్ళు మామూలే సాబ్." బాషా చెప్పాడు మరిచి పొమ్మన్నట్లు.

మిత్ర ద్వయం స్కూటర్ మీద బయలు దేరారు రేపు జరగనున్న సర్జరీకి డబ్బులివ్వడానికి. దాన్ని లంచం అంటారని వాళ్ళకు తట్టలేదు. అందుకు కారణం వాళ్ళ కల్చర్‌కు పంక్చరు కావడం!

(26-12-90 ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక 37)

